

ఇస్రో పిలుస్తోంది

యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా)కు ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నుంచి ఇస్రో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. - 8లో



ఇఫ్తార్ విందులకు నిధులు

రంజాన్ ఇఫ్తార్ విందుల నిర్వహణకు ఉమ్మడి జిల్లాకు తెలంగాణ ప్రభుత్వం రూ.39లక్షలు విడుదల చేసింది. - 8లో



న్యూస్‌రీల్

పోలీస్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల స్వీకరణ

నల్లగొండ : జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 35 మంది అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు.

675 మంది గైర్హాజరు

నల్లగొండ : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు 675 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఫస్టియర్ ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 15,316 మంది విద్యార్థులకు హాజరుకావాల్సి ఉండగా 14,641 మంది హాజరయ్యారు. 675 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి : డీఈఓ

నల్లగొండ : మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు 105 రెగ్యులర్ కేంద్రాలను, 3 ప్రైవేట్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం 18,666 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్: రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ కోతలు నివారించి రైతుల పంటలు ఎండిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు. ఎండిపోయిన వరి పంటకు ఎకరానికి రూ. 30 వేల నష్టపరిహారం ఇవ్వాలని, వరి కోతలు మొదలైనందున ఐకేపీ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి, గడ్డం వెంకట్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, గుండా నవీన్ రెడ్డి, సాయన్న గౌడ్, మాలె వెంకట్‌రెడ్డి, పాదూరి వెంకట్‌రెడ్డి, పిండి పాపిరెడ్డి, జవ్వాది సత్యనారాయణ, రవి ఉన్నారు.

శివుడికి సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : శివకేశవులకు నిలయమైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. శివుడికి ఇష్టమైన రోజు కావడంతో కొండపైన గల శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో రుద్రాభిషేకం, బిల్వార్చనలు, ముఖమండపంలో స్ఫటిక లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఇక ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను అభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవల, నిత్యకల్యాణం, జోడు సేవోత్సవం తదితర పూలు చేపట్టారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల ధర్నా

నల్లగొండ టౌన్ : సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర చేస్తోందని విమర్శించారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు టీఏ, డీఏ, కులగణన లెక్కల సర్వే డబ్బులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్.లక్ష్మీనారాయణ, ఎండీ.సలీం, సత్తయ్య, నాగమణి, విజయలక్ష్మి, పార్వతి, మణెమ్మ, సైదమ్మ, పరిపూర్ణ, సరిత, సుభాషిణి, సునంద, అరుణ, ప్రమీల, స్వప్న పాల్గొన్నారు.

రేషన్.. పరేషాన్!

17వ తేదీ వచ్చినా పేదలకు అందని బియ్యం

- గోదాముల నుంచి కొన్నిచోట్ల రేషన్ దుకాణాలకు కూడా చేరలే
- సీఎంఆర్ సేకరణలో అధికారుల అలసత్వమే కారణం
- అర్ధాకలితో అలమటిస్తున్న పేదలు





ఈ ఫొటోలోని మహిళ గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామానికి చెందిన అనిమల్ల పార్వతమ్మ. ఆమెకు ఇద్దరు కూతుళ్లు. భర్త అనారోగ్యంతో మరణించాడు. ఆమె కూలి పనులు చేస్తూ ఇద్దరు పిల్లలను చదివిస్తోంది. ఆమెకు ప్రభుత్వం ఇచ్చిన అంత్యోదయ కార్డు కింద నెలకు 35 కిలోల బియ్యం వస్తాయి. వాటితోనే నెలంతా భోజనం. ఈ నెలలో ఇంతవరకు బియ్యం రాలేదు. దీంతో వారం రోజులుగా పక్కింటి వారి నుంచి బియ్యం బదులు తెచ్చుకుంటోంది. ఆమె మాత్రమే కాదు జిల్లాలోని అనేక పేదలదీ ఇదే పరిస్థితి.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : రాష్ట్రంలోనే అత్యధికంగా వరిసాగు చేస్తూ, ధాన్యం భాండాగారంగా ఉన్న నల్లగొండలోనే పేదలు అర్ధాకలితో అలమటించాల్సి వస్తోంది. ప్రతి నెలా పౌర సరఫరాల శాఖ పంపిణీ చేసే రేషన్ బియ్యం ఈనెలలో చాలా మండలాల్లో లబ్ధిదారులకు ఇప్పటికీ పంపిణీ కాలేదు. దీంతో పేదలకు అన్నం మెతుకులు కరువయ్యాయి. అధికారులు అలసత్వం కారణంగా పేదలకు రేషన్ ఇవ్వలేని పరిస్థితి దాపురించింది.

గడువు ముగిసినా పేదలకు అందని బియ్యం

994 రేషన్ షాపుల ద్వారా పంపిణీ

జిల్లాలో 4,66,061 రేషన్ కార్డులు ఉన్నాయి. 994 రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు ప్రతి నెలా రేషన్ బియ్యాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ప్రతి నెల 20వ తేదీ నుంచి 30వ తేదీలోగా గోదాముల నుంచి రేషన్‌షాపులకు బియ్యం చేరుకోవాలి. తదుపరి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపు ద్వారా పేదలకు బియ్యం పంపిణీ చేస్తారు. అయితే ఈనెల 17వ తేదీ వచ్చినా ఇంతవరకు జిల్లాలో అనేక మంది పేదలకు బియ్యం అందలేదు. కొందరు డీలర్లు పట్టుబట్టి కొంత మేర తెప్పించుకొని అదీ కొంత మందికే పంపిణీ చేశారు.

సీఎంఆర్ సేకరణలో విఫలం

జిల్లాలో మిల్లర్ల నుంచి బియ్యం సేకరణలో ప్రతిసారి అధికారులు విఫలమవుతూనే ఉన్నారు. మిల్లర్లు ధాన్యాన్ని అమ్ముకొని ప్రభుత్వానికి మాత్రం ఆలస్యంగా సీఎంఆర్ పెడుతున్నారు. మిల్లర్లు, అధికారుల కుమ్మక్కుతో ఈ తతంగం నడుస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఏటా మిల్లర్లు ఆలస్యంగానే సీఎంఆర్ ఇస్తారు. కానీ.. ఏనాడూ గోదాముల్లో బియ్యం ఖాళీ అయిన పరిస్థితి లేదు. ఈసారి మాత్రం అధికారుల ముందు చూపు లేకపోవడం, మిల్లర్ల నుంచి సీఎంఆర్ సేకరించడంలో నిర్లక్ష్యం వహించడం వల్లే ప్రస్తుతం గోదాములు ఖాళీ అయ్యాయి.

95,961 మెట్రిక్ టన్నులు పెండింగ్

2023-24 యాసంగికి సంబంధించి 3,601 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. ఏడాది గడిచినా ఇంకా ఇవ్వలేదంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఇక 2024-25 వానాకాలనికి సంబంధించి 92,362 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. వానాకాలం సీజన్ ముగిసింది. యాసంగి కోతలు కూడా ప్రారంభమయ్యాయి. అయినా ఇంకా బియ్యం ఇవ్వకపోవడం వల్లే పేదలకు సకాలంలో రేషన్ పంపిణీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

ఎమిమిది స్టాక్ పాయింట్ల నుంచి సరఫరా

జిల్లాలో ఎమిమిది రేషన్ బియ్యం స్టాక్ పాయింట్ల నుంచి 33 మండలాల్లోని గ్రామాలకు రేషన్ సరఫరా చేస్తారు. ఇప్పటి వరకు దేవరకొండ, నిడమనూరులో కొన్ని షాపులకు, మిర్యాలగూడలో దాదాపు సగం షాపులకు, నకిరేకల్‌లో 50 షాపులకు, నల్లగొండలో 8 షాపులకు, నార్కట్‌పల్లిలో 21 షాపులకు, నాంపల్లిలో 14 షాపులకు రేషన్ బియ్యం సరఫరా కాలేదు.

గోదాముల్లో బియ్యం నిల్

ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) స్టేజీ-1 గోదాములతో పాటు స్టేజీ-2 గోదాముల్లో కూడా పీడీఎస్‌కు సంబంధించిన బియ్యం నిల్వలు లేవు. వాస్తవంగా ఒక నెలకు సంబంధించిన బియ్యం ముందుగానే అధికారులు తెప్పించి పెట్టుకోవాలి. జిల్లాలో అధికారుల సమన్వయ లోపంతో బియ్యం గోదాములకు చేరలేదు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులంతా తప్పనిసరిగా హాజరు కావాలని.. అప్పుడే ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందన్నారు. పంట మార్పిడిపై జిల్లా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ సీజన్‌కు ముందే ఆయా డివిజన్ల వారీగా రైతు సదస్సులను నిర్వహించాలన్నారు. జూన్ 12న పాఠశాలల పునఃప్రారంభం తర్వాత యూనిఫాం ఇచ్చేందుకుగాను జిల్లా విద్యా, గ్రామీణాభివృద్ధి శాఖలు ముందే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్యాన పంటల వైపు రైతులను మళ్లించాలని సూచించారు. బిహార్ రాష్ట్రంలో 'మఖాన' పంటను అధిక మొత్తంలో పండిస్తున్నారని, మన రైతులు ఈ పంటను సాగు చేసే విధంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ మఖాన పంట సాగు పద్ధతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా మిషన్ భగీరథ నీటిని ఎవరైనా ఇతర అవసరాలకు వాడితే.. జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ప్రత్యేక కలెక్టర్ నటరాజ్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ వై.అశోక్‌రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులు కష్టపడి చదవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటుచేసిన ప్రేరణ తరగతులకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షలను సవాల్‌గా తీసుకొని రాయాలన్నారు. పరీక్షల సమయంలో ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని, స్మార్ట్ వర్క్, హార్డ్ వర్క్ రెండింటిని చేయాలని సూచించారు. పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



తగ్గేదేలే.. కోదాడలో కొనసాగుతున్న రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో భాగంగా రెండవ రోజైన సోమవారం టెన్నికాయిట్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

రెమ్యునరేషన్ చెల్లించాలని వినతి

నల్లగొండ : 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎస్‌ఎస్‌సీ మూల్యాంకనం రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం డీఈఓ భిక్షపతికి టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వెంటనే రెమ్యునరేషన్ చెల్లించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం ఉన్నారు.

రాష్ట్ర ఆర్థిక స్థితి యువతపై ఆధారపడి ఉంది



జాతీయ సదస్సులో పాల్గొన్న వక్తలు, ప్రొఫెసర్లు

మిర్యాలగూడ : రాష్ట్రం ఆర్థికంగా ముందడుగు వేయాలంటే యువత తమ బాధ్యత గుర్తెరిగి నడుచుకోవాలని, రాష్ట్ర ఆర్థిక భవిష్యత్ నిర్దేతలు యువతేనని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ ఇ.పురుషోత్తం అన్నారు. మిర్యాలగూడలోని కేఎస్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్.ఉపేందర్ అధ్యక్షతన 'గ్రోత్ పొటెన్షియాలిటీస్ ఇన్ తెలంగాణ స్టేట్- ప్రాస్పెక్ట్స్ అండ్ ఛాలెంజ్' అనే అంశంపై జరుగుతున్న జాతీయ సదస్సులో సోమవారం ఆయన మాట్లాడారు. తెలంగాణ ఎకనమిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ముత్యంరెడ్డి ఆర్థిక విధానాల్లో సోషలిజం, మార్కెట్ ఎకానమీ మధ్య వ్యత్యాసం, వాటి ప్రయోజనాలు, మౌలిక భేదాలు, సామాజిక సామాన్య అభివృద్ధిపై వివరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ధనిక రాష్ట్రమైన తెలంగాణాలో ప్రజలు బీదలుగా మారడానికి గల కారణాలను విశ్లేషించుకోవాలన్నారు. నేటి తెలంగాణ యువత ప్రతి విషయంలో అనాసక్తత కనబరిచి, నిర్వీర్య స్థితిలోకి వెళ్తోందన్నారు. ఇదే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజారుస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్స్ ముత్యంరెడ్డి, కోటేశ్వర్‌రావు, పున్నయ్య, ఇంద్రకాంత్, ఎస్.రాములు, డాక్టర్ నరేష్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెకో.. పోలీస్ అధికారి

- గ్రామ పోలీస్ అధికారుల నియామకం
- నేరాలు తగ్గించడమే ధ్యేయం
- ప్రజా సమస్యలపై కూడా దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ : నేరాలను తగ్గించేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం కొత్త ప్రణాళికను రూపొందించింది. అందులో భాగంగా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రతి గ్రామానికి ఒక పోలీస్ అధికారిని నియమించారు. వారంతా మంగళవారం నుంచి విధుల్లో చేరనున్నారు. ఆయా గ్రామాలకు నియమించిన పోలీస్ అధికారులు రోజూ క్రమం తప్పకుండా ఆ గ్రామానికి వెళ్లి అక్కడ ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు నేరస్తులపై నిఘా పెట్టాల్సి ఉంటుంది. తద్వార గ్రామాల్లో నేరాలు తగ్గుముఖం పడతాయనేది పోలీస్ యంత్రాంగం ఉద్దేశం.

ప్రజలతో మమేకం కావాలి : ఎస్పీ

ఎస్పీ శరత్‌చంద్ర పవార్ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామ పోలీస్ అధికారుల నియామకం, వారి విధులపై సూచనలు చేశారు. ప్రతి గ్రామ పోలీస్ అధికారి క్రమం తప్పకుండా ఆయా గ్రామానికి వెళ్లాలని ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు అధికారులకు తెలియజేసి.. వాటి పరిష్కారం దిశగా కృషి చేయాలన్నారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ మంచి సంబంధాలు కలిగి ఉండి గ్రామంలో నేరస్తులు, వారి కదలికలను, గ్రామానికి కొత్తగా వచ్చే అనుమానితుల యొక్క సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. తద్వారా గ్రామాల్లో నేరాలు నిరోధించగలుగుతామని పేర్కొన్నారు. గ్రామాల్లో మధ్యవర్తులు, పెద్ద మనుషుల ప్రభావంపై దృష్టి పెట్టాలన్నారు. ఫిర్యాదుదారులు ఎలాంటి భయాందోళనకు గురికాకుండా పైఅధికారిని కలిసే వాతావరణాన్ని కల్పించాలని సూచించారు.

కుష్టువ్యాధి నిర్మూలనే లక్ష్యం

- ఇంటింటా ఎల్‌సీడీసీ సర్వే
- సర్వేలో 1466 బృందాలు



చండూరులో సర్వే చేస్తున్న ఆశ వర్కర్లు

నల్లగొండ టౌన్ : కుష్టు వ్యాధిని సమాజం నుంచి పూర్తిస్థాయిలో పారదోలాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇంటింటా లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయన్ (ఎల్‌సీడీసీ) చేపట్టింది. 2017 నుంచి సంవత్సరంలో రెండుసార్లు నిర్వహించే ఈ సర్వేను సోమవారం జిల్లా వ్యాప్తంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రారంభించింది. ఈ నెల 30వ తేదీ వరకు సర్వేను పూర్తి చేయనున్నారు. సర్వే కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ 1,466 బృందాలను ఏర్పాటు చేసింది. పట్టణంలో అయితే రోజు 50 నుంచి 60 ఇళ్లను ఆశ వర్కర్లు సర్వే చేయాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతంలో అయితే 20 నుంచి 30 ఇళ్లలో సర్వే నిర్వహిస్తారు. సర్వేను మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ప్రోగ్రాం అధికారులతో పాటు ఏఎన్‌ఎంలు పర్యవేక్షించనున్నారు.

పూర్తి శరీరం పరిశీలన

సర్వేలో భాగంగా కుటుంబంలోని ప్రతి ఒక్కరి పూర్తి శరీరాన్ని పరిశీలించి ఎర్ర మచ్చలు, స్పర్శలేని మచ్చలు, నరాల బలహీనత ఉందా లేదా చేతులు కాళ్ల వేళ్ల, తిమ్మిర్లు, బొగ్గలు వాటన్నింటిని ఆశా వర్కర్లు పరిశీలిస్తారు. వారిలో ఏవైనా కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే మెడికల్ ఆఫీసర్ రెఫర్ చేస్తారు. మెడికల్ ఆఫీసర్ పరీక్షించి కుష్టు లక్షణాలు ఉంటే వారిని బహుళ ఔషధ చికిత్స(మల్టీ డ్రగ్ థెరపి ఎండీటీ) పద్ధతిన జిల్లా కేంద్రంలోని లెప్రసీ సెంటర్ ద్వారా చికిత్స అందించనున్నారు.

వ్యాధి లక్షణాలు ఇలా..

కుష్టు వ్యాధి (లెప్రసి)అనేది మైక్రో బ్యాక్టీరియస్ లెప్రో అనే బ్యాక్టీరియా వల్ల కలిగే దీర్ఘకాలిక వ్యాధి. ఇది ప్రధానంగా నరాలు, చర్మం, ముక్కు ద్వారం ఎగువ శ్వాస నాళాలపై ప్రభావం చూపుతుంది. చర్మంపై ఎర్రని గోదుమ రంగు, స్పర్శలేని తిమ్మిరి మచ్చలు ఉంటే కుష్టు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలి.

మచ్చలు ఉంటే చూపించుకోవాలి



శరీరంపై ఎక్కడైన మచ్చలు ఉంటే సర్వేకు వచ్చిన సిబ్బందికి చూపించాలి. లెప్రసి లక్షణాలు ఉంటే స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయిస్తారు. సర్వేకు వచ్చిన వారికి సహకరించి ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి



నల్లగొండలో భగత్‌సింగ్ చిత్రపటాలతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నల్లగొండ టౌన్: భగత్‌సింగ్ ఆశయ సాధనకు యువత, విద్యార్థులు కృషి చేయాలని, డ్రగ్స్ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ స్మారక ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా నిర్వహించడానికి విద్యార్థులు, యువకులు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శులు కంభంపాటి శంకర్, మల్లం మహేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, కొర్ర సైదానాయక్, గుండాల నరేష్, శ్రీను, కట్ట లింగస్వామి, మిర్యాల భరత్, రమేష్, వెంకటేష్, ముసుగు రవీందర్, కార్తిక్, కిరణ్, రవి, కావ్య, స్పందన, జగదీశ్, జగన్ నాయక్, చంద్రశేఖర్, లక్ష్మణ్, సంపత్ పాల్గొన్నారు.

ఎంజీయూలో 'ఇనిట్‌మ్యాథ్' శిక్షణ ప్రారంభం



శిక్షణకు వచ్చిన విద్యార్థులతో ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ తదితరులు

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో గణిత శాఖ ఆధ్వర్యంలో ఆరు రోజుల పాటు నిర్వహించనున్న 'ఇనిట్‌మ్యాథ్' శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణకు నేషనల్ బోర్డ్ ఫర్ హయ్యర్ మ్యాథమెటిక్స్ ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. అన్ని రాష్ట్రాల నుంచి డిగ్రీ సెకండియర్ చదివే విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి 51 మంది విద్యార్థులను ఈ శిక్షణ కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, దోమల రమేష్, మద్దిలేటి పసుపుల, ప్రేమ్‌సాగర్, ఉపేందర్‌రెడ్డి, సముద్రాల ఉపేందర్, సత్యనారాయణరెడ్డి, సుకుమార్, శివాజీ గణేషన్, హైమావతి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, రామచంద్రు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి దుర్మరణం


సందీప్ (ఫైల్)

నేరేడుచర్ల: బైక్‌పై వెళ్తున్న బీటెక్ విద్యార్థి ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకీడు మండలం బెట్టెతండాకు చెందిన బండావత్ సందీప్(20) హైదరాబాద్‌లోని మహవీర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హోలి పండుగకు ఇంటికి వచ్చిన సందీప్ సోమవార నల్లగొండ జిల్లా హాలియాలో తన స్నేహితుడి వివాహానికి బైక్‌పై వెళ్తుండగా.. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి గ్రామ సమీపంలో చెరువు మూలమలుపు వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సందీప్‌ను స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తండ్రి బండావత్ శ్రీనునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను తప్పించబోయి..


ప్రభాకర్ (ఫైల్)

రాజాపేట: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి కింద పడడంతో మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి రాజాపేట మండలం జాల గ్రామంలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జాల గ్రామానికి చెందిన చెవిటి ప్రభాకర్(32) ఆదివారం రాత్రి తనపై బైక్‌పై జాల మైసమ్మ ఆలయం వద్దకు వెళ్లొస్తుండగా.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో ప్రభాకర్ తలకు తీవ్రగాయాలు కాగా.. భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య సంతోష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు..

డిండి: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఘటనలో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన సోమవారం డిండి మండలం హజ్యతండా సమీపంలో జరిగింది. వివరాలు.. డిండి మండలం శేషాయికుంటకు చెందిన ఇంజమూరి సాయి(22) తవక్లాపూర్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. కొత్తతండాకు చెందిన జటావత్ శక్రునాయక్(55) తన బైక్‌పై చెర్కుపల్లి నుంచి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో హజ్యతండా సమీపంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సాయి, శక్రునాయక్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రాజు తెలిపారు.

ఇస్రో పిలుస్తోంది

విద్యార్థులను యువ శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు, పాఠశాల స్థాయిలోనే అంతరిక్ష పరిజ్ఞానం పెంపొందించడమే లక్ష్యంగా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) పనిచేస్తోంది. ఇందులో భాగంగా 2019 నుంచి ప్రతి సంవత్సరం యువ విజ్ఞాన కార్యక్రమం (యువికా) నిర్వహిస్తోంది. విద్యార్థులకు ఇస్రో చేస్తున్న ప్రయోగాలు, వాటి వెనుక దాగి ఉన్న కృషిని తెలియజేసి వారిలో స్ఫూర్తి నింపేందుకు యువికా తోడ్పడుతోంది. - నల్లగొండ, సూర్యాపేటటౌన్, హుజూర్‌నగర్


యువ విజ్ఞాన కార్యక్రమంతో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం

- ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులు
- ఆన్‌లైన్ దరఖాస్తులకు ఈ నెల 23 వరకు గడువు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) అంతరిక్ష పరిశోధనల్లో ఇటీవల వంద ప్రయోగాలు పూర్తి చేసుకుంది. అగ్రదేశాలకు దీటుగా భారత్ అంతరిక్ష రంగంలో పరిశోధనలు చేపడుతోంది. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులను కూడా అంతరిక్ష ప్రయోగాల్లో భాగస్వాములను చేసేందుకు, వారికి అంతరిక్ష ప్రయోగాల గురించి తెలియజేసేందుకు యువికా ద్వారా సహాయ సహకారాలు అందజేస్తోంది. యువికాలో ఎంపికైన విద్యార్థులకు తెలంగాణలోని హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని సూళ్లూరుపేట, కేరళలోని తిరువనంతపురం, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, గుజరాత్‌లోని అహ్మదాబాద్, కర్ణాటకలోని బెంగళూరు, మేఘాలయలోని షిల్లాంగ్ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా యువికా–2025కు సంబంధించి దేశ వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. గత నెల 24వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా.. ఈ నెల 23 వరకు గడువు ఉంది.

విద్యార్థుల ఎంపిక ఇలా..

8వ తరగతిలో విద్యార్థులకు వచ్చిన మార్కులను 50 శాతం వెయిటేజీగా తీసుకుంటారు. అదేవిధంగా ఆన్‌లైన్ క్విజ్‌లో చూపిన ప్రతిభకు 10 శాతం వెయిటేజీ, ఇంతకు ముందు పాల్గొన్న జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి సైన్స్ ఫేర్ (గత 3 సంవత్సరాలు)లకు 2, 5, 10 శాతం వరకు, ఒలింపియాడ్‌లో పాఠశాల, జిల్లా, రాష్ట్ర, ఆపై స్థాయిలో పాల్గొంటే 2, 4, 5 శాతం వరకు వెయిటేజీ ఇస్తారు. స్పోర్ట్స్‌లో పాఠశాల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పాల్గొన్న వారికి 2, 4, 5 శాతం వరకు, స్కౌట్ అండ్ గైడ్స్/ఎన్‌సీసీ/ఎన్ఎస్ఎస్ వాటికి 5 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న విద్యార్థులకు 20 శాతం వెయిటేజీ తీసుకుని తుది జాబితాకు చేస్తారు.



ఎంపిక తేదీలు

మార్చి 23 వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది. ఏప్రిల్ 7వ తేదీన తొలి జాబితాను విడుదల చేయనున్నారు. మే 18న ఇస్రో సూచించిన కేంద్రాల వద్ద రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. మే 19 నుంచి 30 వరకు 2 వారాల పాటు ఎంపికైన విద్యార్థులకు సతీష్ ధావన్ స్పేస్ సెంటర్, శ్రీహరికోట–ఆంధ్రప్రదేశ్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, హైదరాబాద్–తెలంగాణ, విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్, తిరువనంతపురం–కేరళ, యుఆర్ రావు శాటిలైట్ సెంటర్, బెంగళూరు–కర్ణాటక, స్పేస్ అప్లికేషన్ సెంటర్, అహ్మదాబాద్–గుజరాత్, నార్త్–ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్, షిల్లాంగ్–మేఘాలయ, ఐఐఆర్ఎస్, డెహ్రాడూన్–ఉత్తరాఖండ్‌లో ఎక్కడైనా ఒక చోట శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ పూర్తిగా రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుంది. ఎంపికైన విద్యార్థితో పాటు వారి తల్లిదండ్రుల్లో ఒకరు లేదా గైడ్ ఉపాధ్యాయుడికి కూడా ప్రయాణ ఖర్చులు ఇస్రో చెల్లిస్తుంది. మే 31న ముగింపు కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు. ప్రధానంగా అంతరిక్షం, సాంకేతికత, అంతరిక్ష శాస్త్రంపై అవగాహన, అంతరిక్ష అనువర్తనాలపై ప్రాథమిక జ్ఞానం అందిస్తారు. అంతరిక్ష కేంద్రాల్లో ప్రయోగశాల సందర్శన అక్కడి ప్రముఖ శాస్త్రవేత్తలతో సమావేశం, ముఖాముఖి చర్చలు, రాకెట్ ప్రయోగాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించనున్నారు.



దరఖాస్తు చేసే విధానం

అధికారిక ఇస్రో వెబ్‌సైట్ www.isro.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వెబ్‌సైట్ ఓపెన్ చేసిన తర్వాత యూవికా ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఈ–మెయిల్ ఐడీ ద్వారా విద్యార్థికి సంబంధించిన వివరాలు నమోదు చేసుకోవాలి. అనంతరం మెయిల్ ఐడీకి లింక్ వస్తుంది. ఈ లింక్ ద్వారా ఇస్రో ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ స్పేస్ క్విజ్‌లో విద్యార్థి పాల్గొనాల్సి ఉంటుంది. క్విజ్ పూర్తి చేసిన 60 నిమిషాల తర్వాత యువికా పోర్టల్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులో పూర్తి వివరాలు నమోదు చేసి సమర్పించాలి. దరఖాస్తుతో పాటు విద్యార్థి సంతకం చేసిన ప్రతి, విద్యార్థి గత మూడేళ్లలో వివిధ అంశాలలో సాధించిన ప్రగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. 2025 జనవరి 1వ తేదీ నాటికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి భావిభారత శాస్త్రవేత్తలుగా ఎదగడానికి యువికా మంచి అవకాశం. ఇస్రో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ తీసుకుని విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా చూడాలి. పూర్తి వివరాలకు 98485 78845 నంబర్‌ను సంప్రదించాలి.

- బొల్లారం భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

ప్రయోగాల వైపు ప్రోత్సహించాలి



విద్యార్థులను చిన్నప్పటి నుంచే ప్రయోగాలు చేసేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ఇస్రో చేపట్టిన యువికా అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదగాలి. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు యువికాపై అవగాహన కల్పించాలి.

- దేవరాజ్, జిల్లా సైన్స్ అధికారి, సూర్యాపేట

గతంలో జిల్లా నుంచి ముగ్గురు ఎంపిక



యూవికా–2022లో దేశంలో 150 మందిని ఎంపిక చేస్తే తెలంగాణ నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. అందులో నల్లగొండ జిల్లా నుంచి రాహుల్ రంగనాథ్–డిండి మోడల్ స్కూల్, సానియా–నాగార్జునసాగర్ నవోదయ రెసిడెన్షియల్ స్కూల్, విజయ–నల్లగొండ కేంద్రీయ విద్యాలయం నుంచి ఎంపికై హైదరాబాద్‌లో రెండు వారాల పాటు శిక్షణ పొందారు.

- లక్ష్మీపతి, జిల్లా సైన్స్ అధికారి, నల్లగొండ

కాంగ్రెస్ నాయకుడి దారుణ హత్య

- కాపుగాసి గొడ్డళ్లతో నరికిన గుర్తుతెలియని వ్యక్తులు

నూతనకల్: మండల పరిధిలోని మిర్యాల గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మెంచు చక్రయ్యగౌడ్(65) సోమవారం దారుణ హత్యకు గురయ్యాడు. డీఎస్పీ రవి తెలిపిన వివరాల ప్రకారం.. చక్రయ్యగౌడ్ సోమవారం తన వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి వస్తుండగా ముత్యాలమ్మ గుడి సమీపంలో కొంతమంది కాపుగాసి గొడ్డళ్లతో అతడి తల, చేతులు, కాళ్లపై దాడి చేసి పక్కనే రోడ్డు పక్కన గోతిలో పడేశారు. అటుగా వెళ్తున్న గొర్రెల కాపరులు గమనించి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో 108 వాహనంలో చక్రయ్యగౌడ్‌ను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రాజకీయ ఆధిపత్యంతోనే హత్య జరిగినట్లు డీఎస్పీ తెలిపారు. మృతుడి కుమార్తె అనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తుంగతుర్తి సీఐ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.


చక్రయ్యగౌడ్ (ఫైల్)

అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన లారీ

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

కేతేపల్లి: విజయవాడ – హైదరాబాద్ రహదారిపై కేతేపల్లి మండల కేంద్రంలో సోమవారం లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన లారీ సోమవారం విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా.. కేతేపల్లిలోని ఎస్సీ కాలనీ సమీపంలోకి రాగానే లారీ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్లు, ఇనుప బారికేడ్లకు ఢీకొని డ్రైనేజీ కాల్వపై ఆగిపోయింది. ఈ క్రమంలో రోడ్డు పక్కన కొబ్బరి బొండాల దుకాణాన్ని ఢీకొట్టడంతో దుకాణం ధ్వంసమైంది. దుకాణ నిర్వాహకులు పక్కకు పరుగెత్తడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రాహుల్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ ఇంజన్‌లో నుంచి పొగ, మంటలు రావటంతో అప్రమత్తమైన పోలీసులు నకిరేకల్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. డ్రైవర్ మద్యం మద్యం మత్తులో ఉన్నట్లు తెలిసింది.


ధ్వంసమైన లారీ ముందుభాగం

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి


వెంకటేశం (ఫైల్)

కనగల్: మండలంలోని బుడుమర్లపల్లి గ్రామ శివారులో ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతిచెందాడు. కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన ప్రకారం.. కనగల్ మండలం బోయినపల్లి గ్రామానికి చెందిన కడారి వెంకటేశం(45) ఆ గ్రామ మాజీ సర్పంచ్ పగిళ్ల యాదయ్య వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం గ్రామ వాగులో ఇసుకను లోడ్ చేసుకొని నల్లగొండకు తరలిస్తుండగా.. మార్గమధ్యలో బుడుమర్లపల్లి వద్ద ట్రాక్టర్ ట్రాలీ డోరు కొండి ఊడింది. ఇది గమనించిన వెంకటేశం మరో ట్రాక్టర్ డ్రైవర్ సాయంతో డోరును సరిచేస్తుండగా ట్రాక్టర్ ముందుకు కదిలింది. ట్రాక్టర్‌ను ఆపే ప్రయత్నంలో భాగంగా స్టీరింగ్ పట్టుకుని సీటులోకి ఎక్కుతుండగా వెంకటేశం కిందపడిపోయాడు. దీంతో ట్రాక్టర్ టైరు అతడి తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల ధర్నా


యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా శిబిరంలోనే నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

భువనగిరిటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ టీచర్లు కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన 48 గంటల ధర్నా సోమవారం ప్రారంభించారు. ఈ సదర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూరుగు స్వప్న, సిలువేరు రమాకుమారి మాట్లాడుతూ ఐసీడీఎస్ పథకం అమల్లోకి వచ్చి 50 ఏళ్లు గడిచినా అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కారానికి నోచడం లేదన్నారు. ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, ప్రతి నెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలని, పదవీ విరమణ ప్రయోజనాలు వర్తింపజేయాలని, పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వడంతో పాటు ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, ఐసీడీఎస్‌కు నిధులు పెంచి అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని కోరారు. పీఎంశ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను రద్దు చేయాలన్నారు. మంగళవారం కూడా ధర్నా కొనసాగిస్తామన్నారు. సోమవార రాత్రి ధర్నా శిబిరంలోనే అంగన్‌వాడీలు నిద్రించారు. కార్యక్రమంలో యూనియన్, సీఐటీయూ నాయకులు సిద్ధమ్మ, సునీత, వసంత, ఉమా, పద్మ, ప్రమీల, షాహిదా, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుకు నిధులు విడుదల

- ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాలకు రూ.39లక్షలు కేటాయిస్తూ ఉత్తర్వులు



భువనగిరిటౌన్ : రంజాన్ పర్వదినం సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 నియోజక వర్గాలకు రూ.39లక్షలు విడుదల చేస్తూ మైనార్టీ సంక్షేమ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నియోజకవర్గాల వారీగా నిధులు ఇలా..

నల్లగొండ	రూ.5 లక్షలు
మిర్యాలగూడ	రూ.4 లక్షలు
దేవరకొండ	రూ.3 లక్షలు
నాగార్జునసాగర్	రూ.3 లక్షలు
నకిరేకల్	రూ.3 లక్షలు
మునుగోడు	రూ.3 లక్షలు
కోదాడ	రూ.4 లక్షలు
సూర్యాపేట	రూ.3 లక్షలు
హుజూర్‌నగర్	రూ.3 లక్షలు
తుంగతుర్తి	రూ.3 లక్షలు
భువనగిరి	రూ.3 లక్షలు
ఆలేరు	రూ.2 లక్షలు

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం


అంజి (ఫైల్)

మేళ్లచెరువు: బైక్‌పై వెళ్తున్న యువకుడు అదుపుతప్పి రోడ్డు పక్కకు రాగా లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. ఈ ఘటన సోమవారం మేళ్లచెరువు మండల కేంద్రంలో జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన పెద్దారపు అంజి(27) పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. పని నిమిత్తం అంజి సోమవారం బైక్‌పై మేళ్లచెరువు మండలకేంద్రానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మేళ్లచెరువు మండల కేంద్రంలోని హోండా షోరూం సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కకు రాగా.. మేళ్లచెరువు నుంచి కోదాడ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అంజి రోడ్డుపై పడిపోగా అతడి పైనుంచి లారీ వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఏడాది క్రితమే వివాహం జరిగినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. లారీ మైహోం పరిశ్రమకు చెందినది కావడంతో మృతుడి బంధువులు తమకు న్యాయం చేయాలని మైహోం పరిశ్రమ గేటు ఎదుట సోమవారం రాత్రి వరకు నిరసన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వలస కూలీకి తీవ్ర గాయాలు..

చౌటుప్పల్ రూరల్: రోడ్డు దాటుతున్న వలస కూలీని లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ స్టేజీ వద్ద ఆదివారం రాత్రి జరిగింది. సోమవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దంతెవాడకు చెందిన చన్నం సురేష్(19) చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలోని ఓ పరిశ్రమలో కూలీగా పని చేయడానికి రెండు వారాల క్రితం వచ్చాడు. పరిశ్రమలో కూలీ పని లేకపోవడంతో తిరిగి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్లడానికి ఆదివారం రాత్రి దండుమల్కాపురం గ్రామ స్టేజీ వద్ద విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి దాటుతుండగా.. విజయవాడ వైపు వెళ్తున్న లారీ అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా యాదవరెడ్డి తెలిపారు.

విజయ విహార్ ఆవరణలో అగ్నిప్రమాదం

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ అతిథిగృహం ఆవరణలో సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం విజయ విహార్ ఆవరణలో వివాహం జరిగింది. ఆ సమయంలో ఏర్పడిన చెత్తను తొలగించి ఒక దగ్గర చేర్చి సోమవారం సాయంత్రం తగలబెట్టారు. అందులో నుంచి గాలికి మండే విస్తరి ఒకటి లేచి ఆవరణలోని అటవీ ప్రాంతంలో భూమిపై ఎండిపోయిన గడ్డిపై పడడంతో మంటలు అంటుకొని కాలిపోయింది. పర్యాటక సంస్థ ఉద్యోగులు అతికష్టం మీద చెట్ల కొమ్మలతో, నీటితో మంటలను ఆర్పివేశారు. లేదంటే 10ఎకరాల మేర ఉన్న అటవీ ప్రాంతంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్, పార్కులు తగలబడేవి.


మంటలను ఆర్పుతున్న పర్యాటక సంస్థ సిబ్బంది

ఆరుపదులు దాటినా తగ్గని ఉత్సాహం


షటిల్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు


చెస్ పోటీల్లో నువ్వా నేనా అంటూ..


క్యారమ్స్ ఆడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు

- కోదాడలో పోటాపోటీగా రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు

కోదాడ: ఆరుపదుల వయస్సు దాటినా వారిలో ఉత్సాహం ఉరకలేస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తమలోని క్రీడానైపుణ్యాన్ని బహిర్గతం చేస్తూ ఔరా అనిపిస్తున్నారు. రెండు రోజులుగా కోదాడలో జరుగుతున్న రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి పోటీల్లో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు తమలోని క్రీడా ప్రతిభను చాటుతున్నారు. కోదాడ పబ్లిక్ క్లబ్ ఆవరణలో సోమవారం రెండో రోజు పలువురు రిటైర్డ్ ఉద్యోగులు టెన్నికాయిట్, షటిల్, క్యారమ్స్, చెస్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. 33 జిల్లాల నుంచి 300 మంది ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, మంగళవారం సాయంత్రం బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతరామయ్య, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్‌రెడ్డి, బొల్లు రాంబాబు, రిటైర్డ్ ఉద్యోగులు అక్కిరాజు వెంకట్రావ్, గాయం పట్టాభిరెడ్డి, వేనేపల్లి శ్రీనివాసరావు, విద్యాసాగర్, భ్రమరాంబ, రఘు, ఓరుగంటి రవి, గగ్గినపల్లి సుదర్శన్‌రెడ్డి, బాబురావు, మేకల వెంకటేశ్వరరావు, అరుణ పాల్గొన్నారు.

చోరీ చేసేందుకు వచ్చి ఆస్పత్రిపాలైన దొంగ

- గోడ దూకి పారిపోతుండగా రాళ్లపై పడి అపస్మారక స్థితిలోకి..

కోదాడరూరల్: చోరీ చేసేందుకు వచ్చిన దొంగ గోడదూకి పారిపోతుండగా రాళ్ల మీద పడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం అతడిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన సోమవారం కోదాడ పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో జరిగింది. కోదాడ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్ కాలనీలో నిర్మిస్తున్న చర్చిలో దొంగతనం చేసేందుకు సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు కొందరు వచ్చారు. చర్చిలో కిటికీలు, డోర్లు చోరీ చేస్తుండగా శబ్దం రావడంతో ఆ చర్చికి కాపలదారులుగా ఉన్నవారు గమనించి వారిలో ఒకరిని పట్టుకున్నారు. మిగతా వారు పరారయ్యారు. పట్టుబడిన దొంగకు దేహశుద్ధి చేసి ఉదయం పోలీసులకు అప్పగిద్దామని తాళ్లతో కట్టేశారు. తెల్లవారిన తర్వాత దొంగ కట్లు విప్పుతుండగా అతడు వారి నుంచి తప్పించుకొని గోడదూకి పారిపోతుండగా.. గోడ పక్కన ఉన్న రాళ్లపై పడి తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అతడిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై చర్చి పాస్టర్ జోసెఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సూర్యాపేట జిల్లా సాక్షి ఫొటోగ్రాఫర్‌కు అవార్డు

సూర్యాపేట: తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2018, 2024 సంవత్సరాలకు గాను బెస్ట్ న్యూస్ పిక్చర్ అవార్డుకు ఎంపిక పోటీలు నిర్వహించగా.. సూర్యాపేట సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ అనమాల యాకయ్య 2018కి గాను బెస్ట్ న్యూస్ పిక్చర్ అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లోని సురవరం ప్రతాపరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో యాకయ్య గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా అవార్డు, నగదు పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అనమాల యాకయ్య

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


కవిత (ఫైల్)

ఆత్మకూర్ (ఎస్): మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామంలో సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన గోగుల కవిత(30) సోమవారం ఉదయం ఇంట్లో అస్వస్థతకు గురై కిందపడిపోవడంతో భర్త సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తమ కుమార్తె మృతికి తన అల్లుడు గోగుల కమలాకర్, అతడి తండ్రి కారణమని మృతురాలి తండ్రి వెంకన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కమలాకర్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని తన కుమార్తెను వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కమలాకర్, అతని తల్లిదండ్రులు తన కుమార్తెను కొట్టి చంపి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

16గంటలు పాటలు పాడి రికార్డు


రికార్డుల పత్రాలతో చింత వెంకటేష్

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని సుందరయ్య కాలనీకి చెందిన చింత గణేష్ కుమారుడు చింత వెంకటేష్ మూడు అంతర్జాతీయ రికార్డులు సాధించాడు. ఆదివారం హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో నిర్వహించిన గాన లహరి కార్యక్రమంలో వెంకటేష్ పాల్గొని 16 గంటల పాటు నిర్విరామంగా పాటలు పాడి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, రాయల్ సక్సెస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించాడు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియన్ చీఫ్ కోఆర్డినేటర్ బింగి నరేందర్‌గౌడ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలంగాణ కోఆర్డినేటర్ ఎం. హారిక, రాయల్ సక్సెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ రవికుమార్, ఎస్పీ నిర్మల, త్రినాథరావు, అరుణ తదితరులు పాల్గొన్నారు.